క్లుప్తంగా

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి



శావల్యాపురం: ప్రభుత్వ ఆదేశాలు మండలంలోని కారుమంచి, గుంటుపాలెం, పోట్లూరు, వేల్పూరు గ్రామసచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య వెల్లడించారు. చిరునామా, పేరు మార్పులు, జిల్లా పేరు, వేలు ముద్రలు అప్‌డేట్ తదితరవన్నీ శిబిరాలు ద్వారా చేశామన్నారు. డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకొని వారందరు ఆధార్‌కార్డులను ఈ ఏడాది సెప్టెంబరు తర్వాత నిలిపివేస్తామని స్పష్టం చేసిందని వివరించారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన డీఎల్‌డీవో



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని మృత్యుంజయపురం గ్రామ సచివాలయాన్ని నరసరావుపేట డీఎల్‌డీవో వెంకటరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్ష నిర్వహించి సచివాలయంలో ప్రజలకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను సకాలంలో అందించాలని తెలిపారు. సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రేపు యడ్లపాడులో ఉచిత వైద్యశిబిరం

యడ్లపాడు: స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఈనెల 27వ తేదీ ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగా రావుపాలెం విజన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించి ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. క్యాంప్ పర్యవేక్షకులుగా సీనియర్ డాక్టర్ లింగమల్ల మోహన్ భాస్కర్ పాల్గొంటారని రెండు నెలల పాటు సరిపడా మందులు ఇవ్వనున్నారు. యడ్లపాడు సమీప గ్రామప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

ఈపూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాల్లో సామాజిక తనిఖీల అనంతరం 17 గ్రామపంచాయతీలకు సంబంధించి నివేదికను డీఆర్‌పీలు వెల్లడించారు. మండలంలో 2022–23కు సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.4,73,80,463లు కూలీ చెల్లించగా రూ.5,06,407లు మెటీరియల్ కింద చెల్లించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ ఈవూరి బూసిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయకుమారి, జడ్పీటీసీ చౌడయ్య, ఎంపీడీవో రంగనాయకులు, ఎస్ఆర్‌పీ వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, శాకమూరి బుచ్చయ్య, గోలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



యడ్లపాడు: మండలంలోని బోయపాలెం గ్రామం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. 16వ నంబర్ జాతీయ రహదారి పక్కనే వేంచేసి ఉన్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం 31వ తిరునాళ్ల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఆలయ ధర్మకర్తలు హనుమాన్ ప్రసాద్ తివారి, గంగాదేవి దంపతుల ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. వార్షిక తిరునాళ్ల పురస్కరించుకుని స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు.

విత్తనాల కిట్టు, పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

సత్తెనపల్లి: ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులు ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు కిట్టు, ఇతర పరికరాలు సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రిజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో ఎస్సీ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు.

అభివృద్ధి పరుగులు

'అభివృద్ధే మా ఎజెండా.. ప్రజాసంక్షేమమే మా లక్ష్యం' అంటూ సాగిన గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన వినతులు, సమస్యలు పరిష్కారమవుతున్నాయి. శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి స్వయంగా వీటిపై దృష్టిసారించడంతో యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. దీంతో శివారు కాలనీలు, వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ప్రధానంగా రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలను ఇప్పటికే ఆరంభించారు.

ఆఘమేఘాలపై గడప గడపకూ చేరుతున్న అభివృద్ధి ఫలాలు

- పట్టణంలోని పలు వార్డుల్లో కార్యక్రమాలు
- సుమారు రూ.6.20 కోట్ల నిధులు విడుదల



గడపగడప నిధులతో 26వ వార్డు పెద్దచెరువులో సీసీరోడ్డు నిర్మాణం చేసిన దృశ్యం

నరసరావుపేట: పురపాలక పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో సుమారు 70 రోజులపాటు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. సమస్యలు తీర్చేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి వార్డుకు రూ.20 లక్షలు చొప్పున నరసరావుపేట పురపాలక సంఘానికి రూ.6.40 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ అధికారులు పలు వార్డుల్లో అవసరమైన చోట సీసీ రోడ్లు, మంచినీటి పైపులైన్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం చేపట్టి శరవేగంగా పూర్తి చేస్తున్నారు. రెండువార్డు, ఐదోవార్డు, ఎనిమిది, 15వ వార్డు, 18వ వార్డు తదితర పది వార్డుల్లో పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే చాలా పనులు పూర్తి కాగా ఇటీవలనే ప్రకాష్ నగర్‌లోని 10, 13, 14 వార్డుల్లో ఎమ్మెల్యే గోపిరెడ్డి శంకుస్థాపన చేసిన విషయం విదితమే.

డ్రెయిన్లు,కల్వర్టుల నిర్మాణం



15వ వార్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేసిన దృశ్యం

పట్టణానికి నాలుగువైపులా ఉన్న పంచాయతీల పరిధిలోని పలు కాలనీలను పురపాలక పరిధిలోకి తీసుకురావటంతో ఆయా ప్రాంతాల్లో రోడ్లు, వీధి లైట్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం చేస్తున్నారు. పనిచేసిన వెంటనే బిల్లులు సమర్పించగానే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుండటంతో కాంట్రాక్టర్లు హుషారుగా పనులు మొదలు పెట్టి పూర్తిచేస్తున్నారు. గత నాలుగేళ్ల కాలంలో మున్సిపల్ పరిధిలో సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి చేసిన ప్రభుత్వం గడపగడప కార్యక్రమం చేపట్టి దాని ద్వారా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకొని ఆ సమస్యలు తీర్చే కార్యక్రమానికి పూనుకోవటం విశేషం.

యుద్ధప్రాతిపదికన పనులు

> గడపగడప ద్వారా వచ్చిన ప్రజాసమస్యలను తీర్చేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తిచేస్తున్నాం. పనులు చేసే కాంట్రాక్టర్లకు సైతం వెంటనే బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయి. వచ్చే నాలుగు నెలల వ్యవధిలో మొత్తం వార్డుల్లో పనులు చేపట్టి పూర్తిచేస్తాం.
> – ఎం.రామ్మోహనరావు, కమిషనర్

వరాలమ్మా... వందనమమ్మా..

- ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు
- భక్తులతో ఆలయాలు కిటకిట



రొంపిచర్ల వాసవీ అమ్మవారు..

శావల్యాపురం: శ్రావణ మాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి వేడుకలు మహిళలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. హిందూ సంప్రదాయంలో వరలక్ష్మి వేడుకలకు మంచి విశిష్టత ఉంది. ఈ సందర్భంగా మండలంలోని వేల్పూరు, కారుమంచి, శావల్యాపురం, పోట్లూరు,మతుకుమల్లి తదితర గ్రామాల్లో వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శావల్యాపురంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండల ప్రజలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసంలో రెండవ శుక్రవారం రోజున వచ్చే వరలక్ష్మీ వ్రతం పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తుంది. ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు వరలక్ష్మీ వ్రతం చేయడం వలన కలుగు ప్రయోజనాలను గురించి ఆలయపూజార్లు వివరించారు. మండలంలో రొంపిచర్లలో గల వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీ అమ్మవారిని, చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో చౌడేశ్వరీ అమ్మవారిని, విప్పర్ల గ్రామంలో గల వల్లభేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారిని, పలు గ్రామాల్లో గల ఆలయాల అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గల ఆలయాలను భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: శ్రావణ మాసం రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకొని పట్టణంలో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు. రామిరెడ్డిపేటలోని సత్యసాయి మందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ వి.హరినాథ్‌బాబు ఆధ్వర్యంలో దాదాపు 90 మంది మహిళలు వ్రత పూజలో పాల్గొన్నారు. మహిళలు తమ గృహాలలో శ్రీమహాలక్ష్మీ అమ్మవారి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించుకొని పూజలు జరిపారు. అమ్మవారి తీర్థప్రసాదాలను ముత్తైదువులకు అందచేసి వారి వద్ద ఆశీస్సులు పొందారు. పట్టణంలోని ఆలయాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. శృంగేరీ శంకరమఠం, నీలా పద్మావతి సమేత వెంకటేశ్వస్వామి ఆలయం, లీలా వేంకటేశ్వరస్వామి ఆలయం, కళ్యాణ వేంకటేశ్వర స్వామి, కళ్యాణ సుందరేశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిపారు.



నరసరావుపేట సత్యసాయి మందిరంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



గణపవరం కోదండరామాలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు

నాదెండ్లలో...

నాదెండ్ల: శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాలతో పాటూ గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. గణపవరంలోని కోదండరామాలయంలో జరిగిన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయన అర్చకులు దర్శి అనిల్‌కుమార్, ఉమామహేశ్వర శర్మలు అభిషేకాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలకు శుభప్రదమైన శ్రావణ మాసంలో ముత్తయిదువులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గృహాలను పసుపు కుంకుమ, తోరణాలతో అలంకరించారు.


సమన్వయంతో పనిచేయాలి

మండల ఉపాధ్యక్షురాలు గోలి భాగ్యలక్ష్మి

ఈపూరు: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేయాలని మండల ఉపాధ్యక్షురాలు గోలి భాగ్యలక్ష్మి సూచించారు. మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారంజరిగింది. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు పాల్గొని మండలంలో జరుగుతున్న ఆయా పనులను వివరించారు. అలాగే కొందరు ప్రజాప్రతినిధులు ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో తెలియజేశారు. గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, వివిధ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కార మార్గం కనుక్కోవాలని ఆమె పేర్కొన్నారు. త్వరలో వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుచే మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నూతన భవనం ప్రారంభోత్సవం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, ఎంపీడీవో రంగనాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతి వేగం

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒడిశా యువకుడి దుర్మరణం



సంఘటనా స్థలంలో ఒడిషా కార్మికుడు కనహైదాస్ మృతదేహం

నాదెండ్ల: అతివేగం ఓ యువకుడి ప్రాణాలను బలి తీసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కనహైదాస్ (35) అనే కార్మికుడు సీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న పాత ఇనుము దుకాణంలో కూలీగా పనిచేస్తుంటాడు. శనివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో సినిమా హాలు రోడ్డులో తన ద్విచక్రవాహనాన్ని అతివేగంగా నడుపుతూ సడన్ బ్రేక్ వేయటంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా ఉన్న రమ్య స్పిన్నింగ్‌మిల్లు ప్రహరీని ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుమారు రెండు నెలల క్రితమే మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి ఇరువురు సంతానం కాగా ప్రస్తుతం వీరు ఒడిశాలోని స్వగ్రామంలోనే ఉంటున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

27న ఉచిత ఐవీఎఫ్ క్యాంపు

నరసరావుపేట: ఏషియన్ హాస్పిటల్ ఐవీఎఫ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన వినుకొండలో సంతానంలేని దంపతులకు కోసం సంతాన సాఫల్యకేంద్రం ఉచిత క్యాంపు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ త్రివేణి కొండారెడ్డి శుక్రవారం వెల్లడించారు. హనుమాన్‌నగర్, 11వ లైను, వెల్లటూరు రోడ్డు, ఫైర్ స్టేషన్ ప్రక్కనే ఉన్న ఎంపీసీ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5గంటలవరకు నిర్వహించే క్యాంపులో దంపతులకు ఉచిత ఓపీ, స్కానింగ్, వీర్యపరీక్ష, నిర్వహిస్తామన్నారు. ఐయుఎఫ్ అండ్ ఐవీఎఫ్ చికిత్సలపై 50 శాతం రాయితీ ఇస్తామన్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ త్రివేణి కోరారు. ఇతర వివరాలకు 91105 47745 సంప్రదించాలని కోరారు.

దేవస్థాన అభివృద్ధికి విరాళం

నరసరావుపేట రూరల్: మండలంలోని ఇసప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మ వారి దేవస్థాన పున నిర్మాణ పనులకు భక్తులు రూ.1.16 లక్షల విరాళం అందజేశారు. శుక్రవారం ఆలయ కార్యాలయంలో ఈవో టి.సుధాకరరెడ్డికి సత్తెనపల్లికి చెందిన శిరశాల ఉదయకిరణ్ జ్ఞాపకార్థం చెల్లెలు లక్ష్మీ శ్రీవైష్ణవి తల్లిదండ్రులు భావనారుషి, నిర్మల దంపతులు చెక్కును సమర్పించారు. విరాళాలు ఇచ్చే భక్తులకు ఆదాయపు చట్టం సెక్షన్ 80–జి కింద పన్ను మినహాయింపు ఉంటుందని ఈవో పేర్కొన్నారు. కావున భక్తులు విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు.

ఇద్దరు నిందితులు అరెస్ట్

నరసరావుపేట టౌన్: పూరిగుడిసె దగ్ధం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీన చంద్రబాబునాయుడు కాలనీలో పాలెపు అమర్‌నాథ్‌కు చెందిన పూరింటిని అదే ప్రాంతానికి చెందిన రాజేష్, బాజీలు తగలబెట్టారు. పాత కక్షలు నేపథ్యంలో బాధితుడి ఇంటిని నిందితులు దగ్ధం చేశారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ఎస్సీ హాస్టల్‌లో తెలుగుభాషా దినోత్సవం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం చిలకలూరిపేట జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఉపాధ్యక్షుడు గేరా యాకోబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విశిష్ట పురస్కార అవార్డు గ్రహీత దార్ల బుచ్చిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మధురమైన తెలుగు భాషను పరిరక్షించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతిరోజూ పాఠశాల లేదా వసతి గృహాలు, గ్రంథాలయాల్లో కథల పుస్తకాలు చదవటం అలవర్చుకోవాలన్నారు. 50 మంది విద్యార్థులకు కథల పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సలహాదారు, మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు, సభ్యులు షేక్ బాజీ, వెల్ఫేర్ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎక్కడివాడో.. ఇక్కడ కడతేరాడు!



గుర్తుతెలియని మృతదేహం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పల్నాడు రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు 35 నుంచి 40 సంవత్సరాల వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మినీలారీ ఢీకొని వృద్ధుడి మృతి

క్రోసూరు: మినీలారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పాల్ రవీందర్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఎర్రబాలేనికి చెందిన వృద్ధుడు వెలది నాగయ్య(62) టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా సత్తెనపల్లి నుంచి క్రోసూరు వస్తున్న మినీ లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని గుంటూరు తరలిస్తుండగా మృతి చెందాడు.

అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గణపవరంలో గడప గడపకు కార్యక్రమం

నాదెండ్ల: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజల్లో అంతులేని సంతోషం వ్యక్తమౌతోందని, సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే తాముంటామని ప్రజలు చెబుతుండటం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు గీటురాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గణపవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం రెండో రోజు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అమలౌతున్న తీరును ప్రజలతో ముచ్చటిస్తూ ముందుకు సాగారు. మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద నుంచి ప్రారంభమై వడియరాజుల కాలనీ, ముదిరాజ్‌ల కాలనీల్లో పర్యటించారు. ముందుగా కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువై సంక్షేమం, అభివృద్ధి లబ్ధిదారుల ముంగింట్లో చేర్చామన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అన్ని పథకాలను ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన చేశారన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో అన్ని పదవుల్లో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, విద్యావసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహనమిత్ర, లానేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుతో అన్ని వర్గాల్లో సంతోషాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణయుగం ఆవిష్కృతమైందన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ పథకాలను గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు వైఎస్సార్ సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో యడ్లపాడు జెడ్పీటీసీ ముక్తావాసు, చిలకలూరిపేట చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వర రావు, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ మానుకొండ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గణపవరం సొసైటీ మాజీ చైర్మన్ కాట్రు రమేష్, కౌన్సిలర్లు షేక్ ఆదంవలి, తులం సుధాకర్, పిల్లి సాగర్, బిట్రా రాజేంద్ర, నాయకులు కాటా వెంకటేశ్వర్లు, గాలి బుచ్చయ్య, కొండెపాటి నాగయ్య, జెడ్పీ స్కూల్ పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ నన్నెబోయిన శ్రీనివాసరావు, మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు, మాజీ ఎంపీటీసీలు తాళ్ళూరి ప్రభుదాసు, మండలనేని వెంకటేశ్వర రావు, పెంట్యాల వీరయ్య, శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు తలహాఖాన్, కాటా సూర్యనారాయణ, అవ్వారు సుబ్రహ్మణ్యం, షేక్ రహంతుల్లా, బండారు దాసు, ఆముదాలపల్లి అంజనేయులు, అనిసెట్టి కోటేశ్వరరావు, బండారు జయకుమార్, 38వ వార్డు ఇన్‌చార్జి సుజాత, గంటా శంకర్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

సిద్ధమైన బాలుర గురుకులం

- నేడు ప్రారంభించనున్న రాష్ట్ర మంతులు
- సుదీర్ఘ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



గురుకుల పాఠశాల భవనం

యడ్లపాడు: ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థుల కష్టాలు తీరాయి. సుదీర్ఘకాలంగా చాలీచాలనీ ప్రైవేటు భవనంలో కాలం వెళ్లదీస్తున్న వారి సమస్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాశ్వత మోక్షం కల్పించింది. యడ్లపాడు మండలం వంకాయలపాడు పంచాయతీ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం బాలుర పాఠశాల శనివారం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రత్యేక చొరవతో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి సహకారంతో పల్నాడు జిల్లాలో ఆశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకులంకు సొంత భవనం ఏర్పడింది. దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల్లోనూ హర్షాతిరేకాలు కన్పిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏపీ గురుకులం పాఠశాలలు 19 ఉండగా, ఒక్క పల్నాడు జిల్లాలోనే 10 ఉన్నాయి. వీటిలో వంకాయలపాడు పంచాయతీ బోయపాలెం గ్రామం పరిధిలోని పాఠశాల ఒకటి కావడం విశేషం. నూతన భవన సముదాయాన్ని శనివారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరై ప్రారంభించనున్నారు.

ఫలించిన మంత్రి రజిని కృషి

2015 ఆగస్టు 21న వంకాయలపాడు రెవెన్యూ గ్రామం పరిధిలో 8.5 ఎకరాల విస్తీర్ణంలో ఈ పనుల్ని ఏపీ సాంఘిక సంక్షేమశాఖ శ్రీకారం చుట్టింది. బోయపాలెం–సంగంగోపాలపురం మధ్యలో టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన భూములు వెనుక అటవీ ప్రాంతం సమీపంలో సర్వే నంబర్ 488లో దీని నిర్మాణ పనులకు గత ప్రభుత్వం శంకుస్థాపన చేసినా నిధుల రాక పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి చిలకలూరిపేట పట్టణంలోని ఏఎంజీ సంస్థ ఎదురుగా ఓ ప్రైవేటు భవనంలో 480 మంది విద్యార్థులకు 5 నుంచి 10వ తరగతి వరకు గురుకుల పాఠశాల తరగతుల నిర్వహణ కొనసాగుతుంది. సమస్యను తెలుసుకున్న మంత్రి విడదల రజిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రూ.21.15 కోట్ల నిధుల్ని విడుదల చేయించి అత్యాధునిక హంగులు, వసతులు కల్పించి కొత్త భవనాల పనుల్ని పూర్తి గావించారు. అవి చాలకపోవడంతో నాడు –నేడు కార్యక్రమం కింద మరో రూ.36 లక్షల్ని అదనంగా విడుదల చేయించారు.

బీసీల జీవితాల్లో వెలుగులు నింపిన బీపీ మండల్



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సేవా సంఘం నాయకులు

చిలకలూరిపేట: బీసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు బీపీ మండల్ కృషి చేశారని మహాత్మ జ్యోతిరావుపూలే చైతన్య సేవా సంఘం నాయకులు తెలిపారు. బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతిని సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉప్పాల భాస్కరరావు, కస్తూరి వెంకటేశ్వర్లు, మద్దుల వెంకటకోటయ్య, వంకదారి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాయాదవ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీఆర్ క్లబ్ ప్రాంగణంలో బీపీ మండల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్నా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు గోరంట్ల నారాయణ, గోలి భానుప్రకాష్, ఆరాధ్యుల రామకృష్ణ, పోటు శ్రీనివాసరావు, నర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

వినుకొండ(నూజెండ్ల) : నూజెండ్ల మండలంలోని వి.అప్పాపురం సచివాలయ పరిధిలోని మారెళ్ల వారిపాలెం గ్రామానికి చెందిన బత్తుల అంజమ్మ ఇటీవల మరణించడంతో తల్లి మంగమ్మకు వైఎస్సార్ బీమాలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు నగదును శుక్రవారం సర్పంచ్ మారెళ్ల కోటేశ్వరమ్మ నాగిరెడ్డి, సొసైటీ చైర్మన్ పొట్టపల్లి పిచ్చిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జానీబాషా,సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు గాదె నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.